


నేడు చంద్రబాబు నాయుడు పర్యటన

హంద్రీనీవా, కియా, గొల్లపల్లి రిజర్వాయర్ పరిశీలన



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. రాయలసీమ ప్రాజెక్టుల పరిశీలన చేపట్టిన ఆయన గురువారం నాడు హంద్రీనీవా ప్రాజెక్టు పరిశీలనను చేపట్టనున్నారు. కడప పర్యటన ముగించుకుని బుధవారం రాత్రికి అనంతపురం నగరం చేరుకున్నారు. మెట్టుగోవిందరెడ్డి ఫంక్షన్ హాలులో బస చేసిన ఆయన గురువారం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుంచి యాత్రను ప్రారంభిస్తారు. ఎంవైఆర్ ఫంక్షన్ హాలు నుంచి ఆత్మకూరు మండలంలోని సింగనగుట్ట వద్దనున్న రెండో పంప్‌హౌస్ పరిశీలిస్తారు. ఆ తరువాత అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును పరిశీలిస్తారు. అనంతరం 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కియా పరిశ్రమ వద్దకు చేరుకుంటారు. కియా పరిశీలన అనంతరం గొల్లపల్లి రిజర్వాయరు సందర్శించారు. అనంతరం దుద్దేబండ మీదుగా పాలసముద్రం, గోరంట్ల, ఓడిసి మీదుగా కదిరికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. రాత్రికి అక్కడ బసచేస్తారు.



జిల్లాలోకి హంద్రీనీవా నీటి పంపింగ్ (ఫైల్ ఫొటో)

హంద్రీనీవా ఎవరి ఘనత..?

◆ అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న మాటల యుద్ధం ◆ హంద్రీనీవా ప్రాజెక్టు పరిశీలనతో రాజుకున్న పొలిటికల్ హీట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టులపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలోనే ప్రాజెక్టుల పరిశీలనను ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు చేపట్టిన రాయలసీమ యాత్ర మరింత రాజకీయ వేడిని రాజేస్తోంది. తమ హయాంలో ప్రాజెక్టులు చేపట్టామంటే తమ హయాంలో అని సవాళ్లు విరుసుకుంటున్నారు. ప్రాజెక్టులు సాధించిన ఘనత తమదంటే తమదని మాటల యుద్ధాన్ని సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ అత్యంత దుర్భిక్ష ప్రాంతానికి ఎవరి హయంలో ఏ మేరకు పనులు సాగాయన్నది రేఖమాత్రంగా పరిశీలిద్దాం

దుర్భిక్ష ప్రాంతాలుగానున్న రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం సర్ అర్థార్ కాటన్ హయాంలో హంద్రీనీవా అన్న ఆలోచన పుట్టింది. 1980 తరువాత ఎన్టీ.రామారావు ముఖ్యమంత్రిగానున్న సమయంలో ప్రాజెక్టు రూపకల్పనకు అవసరమైన ప్రణాళికకు తొలి అడుగు పడింది. అయితే ప్రాజెక్టు పనులు చేపట్టే దశకు చేరుకోలేదు. 1996లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అయ్యాక 11 మార్చి 1996లో తొలిసారిగా దీనికి శంకస్థాపన చేశారు. కాని పనులు ప్రారంభమవలేదు. 1999లో మరోమారు ఆయనే శంకుస్థాపన చేశారు. అప్పుడు కూడా పనులు మొదలవ్వలేదు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2005లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2006లో రెండో దశకు శంకస్థాపన చేశారు. అప్పటి నుంచే పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. సంపూర్తిగా ఈ పనులు ఇప్పటికీ పూర్తవలేదు. వస్తున్న డిమాండ్ల ఆధారంగా పనులను పెంచుకుంటూ పోతూనే ఉన్నారు.

2012 నుంచి హంద్రీనీవా నీళ్లు

2005వ సంవత్సరం నుంచి పనులు ప్రారంభమైనప్పటికీ 2012లో తొలిదశ పనులు పూర్తయ్యాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగానున్న సమయంలో 2012లో ట్రయల్‌రన్ జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీరుస్తోంది. కరువు పరిస్థితుల్లోనూ తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు తోడు ఈ నీరు రావడంతో జిల్లా సాగు, తాగునీటి అవసరాలు కొంత మేరకు తీరుతున్నాయి. అయితే ఈప్రాజెక్టును మరింత విస్తరించాలన్న డిమాండ్ వస్తూనే ఉంది. ఎందుకంటే ప్రారంభంలో చేపట్టిన 40 టిఎంసిల సామర్థ్యం మేరకు నీటిని తీసుకోలేని పరిస్థితులున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువల వెడల్పునకు డిమాండ్ ఉంది. ఈ ప్రభుత్వం వెడల్పు చేస్తున్నట్టు ప్రకటించినా పనులు మాత్రం ప్రారంభించలేదు.

ఆయా ప్రభుత్వాల హయాంలో కేటాయింపులు ఇలా...

సంవత్సరాలు	అధికారంలో ఉన్న పార్టీ	నిధుల కేటాయింపులు (కోట్లలో)
1991-1995	కాంగ్రెసు పార్టీ	2..50
1995-2004	టిడిపి	21.22
2004-2009	కాంగ్రెసు	3156.89
2009-2014	కాంగ్రెసు	3153
2014-2019	టిడిపి	5625.25
2019-2023	వైసిపి (ప్రస్తుతం)	1926.07



హోంగార్డులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలి

ఎస్పీ కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

క్రమశిక్షణకు మారుపేరయిన పోలీసుశాఖ ప్రతిష్ట పెంచేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో హోంగార్డుల సమస్యల పరిష్కారం కోసం హోంగార్డ్స్ దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు హోంగార్డుల సేవలు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్నారు. శాంతి భద్రతల కోసం పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులోనూ హోంగార్డ్స్ వారి విధులను చిత్తశుద్ధితో నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని ఉన్నతంగా చూసుకోవాలన్నారు. పిల్లల చదువు, తదితర అభివద్ధి విషయాల్లో రాజీపడకూడదన్నారు. ఆరోగ్య విషయాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అమలవుతున్న పోలీసు సంక్షేమ కార్యక్రమాలైన యూనిట్ పోలీసు ఆసుపత్రి, క్యాంటీన్, పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు, పోలీసు డిజిటల్ లైబ్రరీల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పోలీసు ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని సూచించారు. అనంతరం 'దర్బార్' కార్యక్రమంలో పలువురు హోంగార్డ్‌లు వారి సమస్యలను ఎస్పీ దష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రీజియన్ హోంగార్డుల కమాండెంట్ ఎం.మహేష్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, హోంగార్డ్స్ డీఎస్పీ లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

నిబంధనలు పాటించకుంటే కేసులు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేయాలని డిఐజి ఆర్ఎస్.అమ్మిరెడ్డి ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బుధవారం అనంతపురం నగరంలోని ప్రధాన రోడ్లను పరిశీలించారు. ట్రాఫిక్ కి అడ్డంకిగా మారుతున్న అంశాలపై నిశితంగా పరిశీలించారు. ఎక్కడ టౌన్ న్యూసెన్స్ అధికంగా ఉందో ఆయా ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావన్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపినా, నో పార్కింగ్ ప్లేస్‌లో పార్కింగ్ చేసినా టౌన్ న్యూసెన్స్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవప్ప కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-శెట్టూరు

మండల పరిధిలోని అయ్యగార్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త వడ్డే సంజీవప్ప అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకుడు డాక్టర్ ఉన్నం మారుతి చౌదరి అయ్యగార్లపల్లి గ్రామానికి వెళ్లి సంజీవప్ప మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం టిడిపి మండల అధ్యక్షుడు గోళ్ళ వెంకటేశులు, మాజీ మండల అధ్యక్షుడు గురుప్రసాద్, రంగప్ప, మాజీ సర్పంచి నాగిశెట్టి, వడ్డే గంగాధర, తిప్పేస్వామి, మారేష్, పెట్రోల్ బంకు మధు, చంద్రాయుడు, రామాంజనేయులు, ధనుంజయ, వడ్డే రామరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ చేసే వరకూ పోరాటం - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



అనంతపురం జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు

విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు, ఎఐటియుసి నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం నాడు ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, ఎఐటియు రాష్ట్ర నాయకులు రాజారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం గత 16 నెలలుగా 25 సార్లు చర్చలు జరిపిందన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందనా లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసి ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్ట్రగుల్ కమిటీ సమస్యల పరిష్కారంపై ఈనెల 26న యాజమాన్యంనకు సమర్పించిన వినతిలోనూ అన్ని అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ నెల 7వ తేదీన తిరుపతి విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద జరిగే ఆందోళన కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ గత 16 నెలలు గడిచినా ప్రకటించక పోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైషన్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ జిల్లా నాయకులు మారుతి, జిలాన్, సూరి, ఇబ్రహీం, నబీరసూల్, రామచంద్ర, రమాదేవి, మధు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం వామపక్ష కార్మిక సంఘాలతో కలిసి స్ట్రగుల్ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పాపు. విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఈ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి నాయకులు వెంకటనారాయణ ఏటీఎం నాగరాజు, మల్లికార్జున, విద్యుత్ మీటర్ రీడింగ్ నాయకులు రమేష్, సుబ్రహ్మణ్యం, నల్లప్ప , చంద్ర తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యేలు, నాయకులు

ప్రాజెక్టుల పేరుతో టిడిపి నిధుల దోపిడీ

◆చంద్రబాబు పాలనలో చేసింది శూన్యం ◆వైసిపి ఎమ్మెల్యేల ఆగ్రహం

ప్రజాశక్తి -అనంతపురం

టిడిపి అధికారంలో ఉన్నన్ని రోజులూ చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల పేరుతో నీళ్ల కాకుండా నిధులు పారించారని వైసిపి ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాడు అనంతపురం జిల్లా వైసిపి కార్యాలయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శంకరనారాయణ, డా॥సిద్ధారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి పూర్తి చేసినట్లు చెప్పుకునే ప్రాజెక్ట్ ఒక్కటీ లేదన్నారు. రామారావు 40 టిఎంసిలతో హంద్రీనీవా ప్రాజెక్టుకు డిపిఆర్ సిద్ధం చేసినా, చంద్రబాబు దానిని 1998లో తాగునీటి ప్రాజెక్టుగా మార్పు చేశారన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 60 వేల కోట్లు ఖర్చు చేసి దాదాపు 63 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో 23 ప్రాజెక్టులు పూర్తి చేశారని తెలిపారు. తక్కిన ప్రాజెక్టులు 60 నుంచి 80 శాతం వరకు పనులు పూర్తి చేయించారని చెప్పారు. అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్ వరకు హంద్రీనీవా మొదటిదశ పనులు పూర్తి చేయించి కృష్ణా జలాలు తీసుకొచ్చారన్నారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో 60 వేల కోట్లు ఖర్చు చేసి 70 శాతం పనులు పూర్తి చేసిన ప్రాజెక్టులకు సంబంధించి 30 శాతం పనుల్లో 15 శాతం పనుల కోసం చంద్రబాబు 60 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇలా చంద్రబబు ప్రాజెక్టుల పేరుతో నిధులను దుర్వినియోగం చేశారు తప్పా నీళ్లను తెప్పించి లేదన్నారు. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు నయాపైసా కూడా పరిహారం ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు రైతులను మోసం చేశారన్నారు. అలాంటి వ్యక్తి ప్రాజెక్టుల పేరుతో ఇప్పుడు సందర్శనకు రావడం సిగ్గుచేటన్నారు. రైతులందరూ చంద్రబాబు పర్యటను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ లిఖిత, హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దీపిక, పాల్గొన్నారు.

నాసిరకం పనులతో ప్రజాధనం వృథా



నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎంపిటిసి రమీజాబీ

◆ కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి

◆ మండల సమావేశంలో నేలపై కూర్చొని ఎంపిటిసి నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రాజీవ్ కాలనీ పంచాయతీలో పలు అభివృద్ధి పథకాల పనులు నాసిరకంగా చేపట్టిన కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని రాజీవ్ కాలనీ ఎంపిటిసి సభ్యులు రమీజాబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రాజీవ్ కాలనీ ఎంపిటిసి సభ్యురాలు రమీజాబి నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ విషయాలపై చర్చించాలని ఆమె అధికారులకు విన్నవించినా ఫలితం లేక పోవడంతో ఆమె కింద కూర్చొని నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీవోలు స్పందించి మీ సమస్యలను సమావేశంలో తెలిపితే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆమె నిరసన విరమించి అధికారులకు సమస్యలను వివరించారు. రాజీవ్ కాలనీ పంచాయతీ భగత్ సింగ్ నగర్‌లో సిమెంట్ రోడ్డు కొన్ని రోజుల క్రితమే వేశారని, అవి అప్పుడే పాడైపోయాయని చెప్పారు. క్యూరింగ్ లేకపోవడం, ఇసుక, సిమెంట్, కంకర సమ మోతాదులో కలపడం లేదని తెలిపారు. ప్రియాంక నగర్‌లో సంవత్సరం కిందట వరదలు వచ్చి బ్రిడ్జి కొట్టుకు పోవడంతో ఇప్పుడు బ్రిడ్జిని కొత్తగా నిర్మిస్తున్నారని తెలిపారు. కానీ కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేస్తున్నప్పటికి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులకు సిపిఎం నాయకులు విన్నవించినా ఫలితం లేదన్నారు. కాంట్రాక్టర్లు ఇస్తున్న లంచాలకు కొందరు అలవాటు పడి మిన్నకుండిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహదేవ్ నగర్ 2వ సచివాలయం దగ్గర నుంచి గణేనాయక్ కాలనీకి కాలువలు మంజూరై రెండు సంవత్సరాలు అవుతోందన్నారు. ఈ పనుల కోసం వచ్చిన 300 మూటలు సిమెంటును కాంట్రాక్టర్ వేరే పనులకు ఉపయోగించుకున్నా ఇప్పటిదాకా అధికారులు దీనిపై స్పందించలేదన్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పంచాయతీ సెక్రెటరీ దష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదన్నారు. ఎంపిడిఒ, తహశీల్దార్, ఎంపిపిలను అడగాలంటూ దురుసుగా సమాధానాలు చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై ఎంపీపీ, ఎంపీడీవోలు స్పందించారు. సమస్యలను ఆశాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎంపిటిసి ఆందోళన విరమించారు.

నాటక రంగ దిగ్గజం 'బళ్లారి రాఘవ'

ఆర్డీవో మధుసూదన్



బళ్లారి రాఘవకు నివాళి అర్పిస్తున్న ఆర్డీవో మధుసూదన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగు నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ నాటక రంగానికి ఎనలేని సేవ చేసి, నాటక రంగ దిగ్గజంగా నిలిచారని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. అనంతపురం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం రెవెన్యూ భవనంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ 143వ జయంతి ఉత్సవాలను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవోతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, నాటక కళాకారులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. బళ్లారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ బళ్లారి రాఘవ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఆయన నాటక రంగానికి ఎనలేని సేవ చేసారని కొనియాడారు. మహిళలు నాటకరంగంలో ప్రవేశించడానికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. మహాత్మాగాంధీ లాంటి వారిని సైతం తన నాటక కళతో మెప్పించారన్నారు. ఇతర దేశాలలో కూడా తన ప్రదర్శనలు నిర్వహించి, నాటక రంగ ప్రతిభను చాటారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, మేనేజర్ పివి.దీపక్, అపర్సెంట్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

సాకే భారతికి ఆత్మీయ ట్రస్ట్ ఆర్థిక చేయూత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



ఆర్థిక సాయం అందిస్తున్న ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్ జయచంద్రారెడ్డి

కూలి పని చేస్తూ ఎస్‌కెయులో పిహెచ్‌డి పూర్తి చేసిన సాకే భారతికి ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.65 వేలు ఆర్థిక చేయూతను అందించారు. బుధవారం నాడు అనంతపురం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆత్మీయ ట్రస్టు ఛైర్మన్, యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయ చంద్రారెడ్డి చేతుల మీదుగా సాకే భారతికి రూ.65 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యంలా సాకే భారతి పేదరికాన్ని జయంచి పిహెచ్‌డి పూర్తి చేయడం గర్వించదగిన విషయం అన్నారు. నేటి సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలిచిందన్నారు. కష్టపడి చదివి ఉన్నత విద్యను పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. పేదరికంలో ఉన్న భారతి కుటుంబాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆత్మీయ ట్రస్ట్ తమవంతుగా ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన డైరెక్టర్ పరమేశ్వర్ రెడ్డి నంగి, టెక్సాస్, యుఎస్ఎ, వారి మిత్ర బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ సూర్యప్రకాష్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు రంజిత్ కుమార్, యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లిలో పొలంబడి

శెట్టూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో వ్యవసాయ అధికారులు పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగు మందులు వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు యల్లప్ప, మండల వ్యసాయాధికారిని జి.సంధ్యా కుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి కె.ఆంజనేయులు, సర్పంచ్ జి.విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో డ్రాపౌట్ విద్యార్థులు(బడి బయట ఉన్న బడిఈడు పిల్లలు) ఖచ్చితంగా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ యోగా నందరెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులకు కడవకల్లు జడ్పీ హైస్కూల్‌లో మండల నోడల్ ఆఫీసర్ ఓబులమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం వెంకట్రామిరెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలి

పుట్లూరు : 'నా భూమి-నా దేశం'లో భాగంగా ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా ప్రతి పంచాయతీలో ఒకే చోట 75 మొక్కలు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే స్వతంత్ర సమరయోధుల ఫొటోలను కూడా అక్కడ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒలు కేశవులు, భాగ్యలక్ష్మి, ఈఓఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

ఆత్మకూరు : రాయలసీమలో అర్ధాంతరంగా ఆగిన సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించేందుకు వస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పరిటాల సునీత బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు సమీపంలో సింగనగుట్ట వద్ద ఆగిపోయిన జీడిపల్లి-పేరూరు సాగు నీటి కాలువ నిర్మాణం పనులను పరిశీలించడానికి చంద్రబాబు గురువారం(నేడు) ఆత్మకూరుకు చేరుకుంటారన్నారు. కావున మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

శింగనమల : మండలంలో టిడిపి బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తామని టిడిపి జిల్లా తెలుగు యువత నాయకుడు కాయల రాజశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ జన్మదిన శుభాకాంక్షల వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3వ తేదీ బండారు శ్రావణి శ్రీ జన్మదినం సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనుష్, రాజా, అంజి, రామాంజనేయులు, యశ్వంత్, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

'వైసిపికి ముందుంది అసలు సినిమా'

అనంతపురం : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టిలో సినిమా సినిమానే.. రాజకీయం రాజకీయమే.. కాదు కూడదు అని కారుకూతలు కూస్తే వైసిపికి అసలు సినిమా ముందు ముందు చూపించాల్సి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి వరుణ్ పేర్కొన్నారు. నగరంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పవన్ జీవితం తెరిచిన పుస్తకం అన్నారు. బ్రో సినిమాలో నటుడు పృథ్వీ పాత్రను తనకు తాను సొంతం చేసుకుంటున్న మంత్రి అంబటి రాంబాబుకు మతి భ్రమించి ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పవన్‌పై ఒకటి కాకపోతే వంద సినిమాలు తీసుకో.. ఇలాంటి తాటాకు చప్పులకు జంకే ప్రసక్తే లేదన్నారు. పవన్ కళ్యాణ్‌పై ప్యాకేజీ ఆరోపణలు నిరూపించకపోతే మంత్రి అంబటి రాంబాబు భరతం పడతామని హెచ్చరించారు.

కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలు విడుదల

నార్పల : చలో కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి తపాలా శివశంకర్, సహాయ కార్యదర్శులు తపాలా శ్రీనివాసులు, కడపల నారాయణస్వామి, కోశాధికారి జగదీష్, కుళ్లాయప్ప, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గుత్తి : మండల పరిధిలోని బేతాపల్లి పాఠశాలలో బుధవారం 40 మంది 9వ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన డి.సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డి.వెంకటేశ్వర ప్రసాద్ జామెట్రీ బాక్స్‌లు, పరీక్షల అట్టలు, పెన్నులు తదితర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ముందుగా జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు ఓబుళపతి, సులోచన, సుజాత, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, నరేంద్రగౌడ్, సాధన, రత్నకుమారి, రామకృష్ణయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

గుత్తి : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అలెగ్జాండర్ గ్రహంబెల్ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, కోశాధికారి ఫకృద్దీన్, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, కృష్ణవేణి, గోవిందప్ప, నారాయణశెట్టి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయండి

డిఎంహెచ్ఒ యుగంధర్

ప్రజాశక్తి-అనంతపురం

ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. యుగంధర్ ఆదేశించారు. ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై బుధవారం ఆయన జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. అలాగే ప్రతి హై రిస్క్ గర్భిణిని అవసరాన్ని బట్టి వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించాలన్నారు. హెపటైటిస్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, కాన్పు ప్రణాళిక రూపొందించి ఎఎన్‌ఎం ఆప్‌లో నింపాలన్నారు. ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్త దగ్గర గర్భిణి నిర్ధారణ పరీక్షల కిట్టు లేనిచో చర్యలు తప్పవన్నారు. చిన్న పిల్లల నమోదు కార్యక్రమం కూడా పూర్తి చేయాలన్నారు. ప్రతి పిహెచ్‌సిలో నెలకి కనీసం మూడు కాన్పులు నిర్వహించి, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో వేసే జీరో డోసులు కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ హర్ష, డాక్టర్ మహేంద్ర పాల్గొన్నారు.

గుంతకల్లు : పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించడం ఆరోగ్యకరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక 60 అడుగుల రోడ్డులోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా శ్రీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలన్నారు. అలాగే గర్భం దాల్చిన సమయం నుంచి ఆకుకూరలు, పాలు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, రాగిజావ, తదితర బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే పాలు సమృద్ధిగా పడతాయని తెలిపారు. తల్లిపాలను పిల్లలకు రెండేళ్ల వరకు తాగించాలన్నారు. అనంతరం ఆ వార్డులో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె మయూరి, ఎఎన్‌ఎం జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల ఆవశ్యకతపై గుంతకల్లులో ర్యాలీ చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బంది

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరసన దీక్షలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సాకే శైలజానాథ్ హాజరై మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎంతో అవసరమైన తాగునీటి పథకాలు సజావుగా నడవాలంటే ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాలు పోషించుకుంటున్నారని, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే వారి పిల్లల చదువులు, వైద్య సమస్యలు, ఇంటి అద్దెలు ఎలా చెల్లించగలుగుతారని ప్రశ్నించారు. ఇచ్చే వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు. శాశ్వత పనులు చేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించేంత వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కౌలు రైతు ప్రధాన కార్యదర్శి ఎం.బాల రంగయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శి వెంకట నారాయణ, శ్రీసత్యసాయి శ్రీరామి రెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు బి.నాగరాజు, కొండారెడ్డి, తిప్పయ్య, స్వామి, శ్రీనివాసులు, వస్కారప్ప పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతుగా దీక్షల్లో కూర్చొన్న శైలజానాథ్

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మారుతున్న టెక్నాలజీ(సాంకేతికత)కి అనుగుణంగా అవగాహన పెంపొందించుకోవాలని నగర మేయర్ మహమ్మద్ వసీం సచివాలయ సిబ్బందికి సూచించారు. నగరపాలిక, లీవ్ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సచివాలయ సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వార్డు సెక్రటరీలకు 4 రోజుల పాటు కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పివివిఎస్ మూర్తి, కమిషనర్ భాగ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఉద్యోగి ఉద్యోగానికి సంబంధించిన అంశాల్లో తప్పనిసరిగా నైపుణ్యం సాధిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ నేడు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం వారు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు సాకే చంద్ర, అబూసాలేహా, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇళ్ల నుంచే నీరు తెచ్చుకుంటున్నారన్నారు. పాఠశాలలో నాసిరకం కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం సుభాన్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివనాయక్, రవి, సుధాకర్‌యాదవ్, జిలాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అక్రమ కేసులను కొట్టివేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని శనగల గూడూరు గ్రామంలో అక్రమంగా నమోదు చేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను కొట్టివేయాలని, లేనిచో కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతామని ఏపీ రెడ్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో రెడ్డి కులస్తులు ర్యాలీగా ఎ.కొండాపురం చేరుకొని అనంతపురం-తాడిపత్రి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొందరు అన్యాయంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు వెళ్తున్నారని, దీంతో రెడ్లతో పాటు ఇతర ఓసీ కులాలు, బిసిలు, మైనార్టీలు జైలు పాలవుతున్నారన్నారు. అంతకుముందు ఆయన సంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి భయపరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్య దర్శి గంగలకుంట కేశవరెడ్డి, రెడ్డి జెఎసి కార్యదర్శి శేషాద్రిరెడ్డిలతో కలిసి ఆ గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో తాడిపత్రి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పిచ్చిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఇంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా ప్రచార కార్యదర్శి పల్లె వినోద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భీమేశ్వరరెడ్డి, ఎల్లనూరు మండల కన్వీనర్ నిట్టూరు శ్రీనివాసరెడ్డి, వేణురెడ్డి, సూర్యచంద్రారెడ్డి, జెఎసి సభ్యులు రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి -అనంతపురం

తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని నాయక్‌నగర్, కృపానందనగర్ పరిధిలోని లబ్ధిదారులకు బుధవారం ఎస్కేడీ స్కూల్‌లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకే ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుభద్ర, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో ఐసిడిఎస్ సిడిపిఓ మల్లేశ్వరి ఆదేశాలతో టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు నెలకు సరిపడా నిత్యవసర వస్తువుల కిట్టును సర్పంచి ఆంజనేయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం శ్యామల, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతపురంలో కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్

ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దేశంలో, రాష్ట్రంలో వైద్య విద్య సీట్లను అమ్ముకుంటు చేస్తున్న వ్యాపారాలు నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. బుధవారం వైద్య విద్య సీట్లు అమ్ముతున్న ప్రక్రియను నియంత్రించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో గుంతకల్‌లో నిర్వహిస్తున్న ప్లీనరీ సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్య సీట్లు అమ్ముకోవడం వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులకు నష్టం జరుగుతోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల పేద విద్యార్థులకు నష్టం జరుగుతోందన్నారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం వహిస్తోందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్లీనరీ సమావేశాలకు విద్యార్థులు, యువత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజిత, సిద్ధార్థ, తరిమెల గిరి, రాచేపల్లి సూర్య ప్రకాష్, శివ, శివమ్మ, పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ కొండయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాజీవ్ కాలనీ పంచాయతీ గణేనాయక్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, మహదేవ్ నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం నాయకులు, కాలనీ వాసులతో కలిసి విద్యుత్ శాఖ డి5 కార్యాలయం ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాల జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కాలనీ ఉప సర్పంచ్ మసూద్, ఎంపీటీసీ సభ్యురాలు రమీజాబీ, సిపిఎం నాయకులు బాబు, డేవిడ్, పెద్ద మసూద్, వన్నురు, శ్రీనివాసులు, రాము, నరసింహారెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఎఇకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పెండింగ్ వేతనాలకై 4న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం(రేపు) కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు సిఐటియు నాయకులు హనుమంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవా రం రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీలో సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా హనుమంతరెడ్డి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వేతనాల కోసం ఆగస్టు 4న రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ల వద్ద చేపట్టనున్న ధర్నాలో పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఉమాగౌడ్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సంధ్యాబాయి, రాజు, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మికులు

బళ్లారి రాఘవ అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం కళలకు పుట్టినిల్లు అని వక్తలు పేర్కొన్నారు. బళ్లారి రాఘవ జయంతి పురస్కరించుకుని బుధవారం నగరంలోని లలితకళా పరిషత్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు లక్ష్మీనారాయణ, చిదంబరరెడ్డి, ఖాదర్ బాషా, అరుణ్ బాబులను శాలువాతో సత్కరించారు. ఎల్‌కెపి ద్వారా కళలను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎల్‌కెపి అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సభ్యులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న అతిథులు

వేరుశనగ పంట పరిశీలన

నార్పల : నార్పల-2, గూగూడు ఆర్‌బికెలో సాగుచేసిన వేరుశనగ పంటను బుధవారం తాడిపత్రి వ్యవసాయ సహాయ సంచాలకులు చెంగల్ రాయుడు, నార్పల ఎఒ చెన్న వీరస్వామి పరిశీలించారు. మండలంలో మొత్తం 1,750 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. వర్షాధారం కింద 25-30 రోజుల క్రితం సాగు చేసిన పంటకు ఆకు ముడత, పచ్చ పురుగు తెగుళ్ల ఆశించినట్లు గుర్తించి మందులు పిచికారి చేయాలని సూచించారు. వారి వెంట గ్రామ వ్యవసాయ అధికారులు కుమార్‌రాజా, నరేష్, అజయ్, రైతులు ఉన్నారు.

నార్పలలో కేంద్ర బృందం పర్యటన

నార్పల : స్వచ్ఛభారత్‌లో భాగంగా నార్పలలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కేంద్ర బృందం పర్యటించింది. వారు ప్రాథమిక వైద్యశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, సుల్తాన్ పేటలోని అంగన్వాడీ కేంద్రం, సాయిబాబా దేవాలయం ఇద్ద పలు గృహాలను పరిశీలించి పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ అనంత కేంద్ర బృందం సభ్యుడు మణికంఠ, డాక్టర్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, పరశురాముడు, ఎఎన్‌ఎంలు, హెచ్‌ఎం నగేష్, పాల్గొన్నారు.



నార్పలలో పర్యటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు

నేరాలు ఘోరాలు

మహిళ మృతిపై కేసు నమోదు

అనంతపురం క్రైం : మహిళ అనుమానాస్పదంగా మృతి చెందటంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సిఐ ధరణీకిషోర్ తెలిపారు. అరుణోదయ కాలనీకి చెందిన షేక్‌పర్వీన్ మంగళవారం ఒక్కసారిగా కుప్పకూలి మీతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం పర్వీన్ అన్నలైన షామీర్ బాషా, నూర్‌ల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని సిఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం : అత్తారింటికి వెళ్తూ మహిళ అదృశ్యమైనట్లు త్రీ టౌన్ సిఐ ధరణీకిషోర్ తెలిపారు. గార్లదిన్నె మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన దూదేకుల రంగనాయకులు రెండో కుమార్తె మాబ్బీను పులివెందులకు చెందిన నూర్ బాషాకి ఇచ్చి వివాహం జరిపించారు. గత నెల 28న పుట్టింటికి వచ్చిన మాబ్బీని తండ్రి 31వ తేదీ అనంతపురం బస్టాండ్‌లో వదిలి వెళ్లాడు. మధ్యాహ్నం తండ్రి ఫోన్ చేయగా పార్నపల్లె వద్ద బస్సులో వెళ్తున్నట్లు చెప్పింది. అప్పట్నుంచి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ధరణీకిషోర్ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన రైతుల పొలంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని వైరును ఎత్తుకెళ్లారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతులు రాము, జయకృష్ణ, కృష్ణమూర్తి పెన్నహోబిలం ఆలయ మాన్యం భూములను వేలంలో దక్కించుకుని అందులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయ పనులు చేసుకునేవారు. అయితే మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి విద్యుత్ వైర్లు, స్టార్టర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. దీంతో రూ. 1.2 లక్షల నష్టం వాటిల్లింది. రాము ఐదెకరాల్లో వేరుశెనగ సాగుకు రూ. 80వేలు, కృష్ణమూర్తి 5 ఎకరాల్లో పంట సాగు కోసం రూ. 1.3 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పంటలు చేతికి వచ్చే సమయంలో దొంగలు ఇలా చేయడంతో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉరవకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు.

గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దపప్పూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్దపప్పూరులో సీసీ రోడ్లు వేయించామన్నారు. సంక్షేమ పథకాలు, నవరత్నాలు అందాలంటే మరోమారు జగన్ ప్రభుత్వమే రావాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జనార్దన్‌రెడ్డి, నాగిరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణ శివారులోని 20వ వార్డు పైతోట ప్రాంతంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు బుక్‌లెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పి.శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, మున్సిపల్ వార్డు సభ్యులు సంజీవ, గోవిందరాజులు, పద్మజ, గోవింద, వైసిపి నాయకులు శివ, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ఎఇకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

జిల్లాకు ఆర్‌డిటి వరం : ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాకు ఆర్‌డిటి సంస్థ ఒక వరం అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఈమె కుమారుడు ఆలూరు విరాట్ పుట్టినరోజు సందర్భంగా వారు బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్డీటీ బధిరుల పాఠశాలలో విద్యార్థుల మధ్య విరాట్ పుట్టినరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి తన రెండు నెలల వేతనాన్ని ఆర్డీటీ సంస్థకు అందజేశారు. అలాగే విద్యార్థులకు దుస్తులు అందించి అన్నదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో లక్షలాదిమంది పేద ప్రజల జీవితాల్లో ఆర్‌డిటి వెలుగు నింపిందన్నారు. విద్యార్థులు అంగ వైకల్యాన్ని మరిచి అద్భుతమైన నైపుణ్యాలతో ఆత్మవిశ్వాసంతో ఉండటం వెనుక సంస్థ కృషి, సిబ్బంది నిబద్ధత ఉన్నాయని ప్రశంసించారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర్య సమరయోధుడు, జియాలజిస్ట్ పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమా, మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు హాజరై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, బాషా, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే డిపాజిట్లు చెల్లించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే డిపాజిట్లు చెల్లించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ ఏజెంట్ జిల్లా అధ్యక్షులు బి.నారాయణప్ప, తాడిపత్రి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ అనంతపురం జిల్లా సిపిఐ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారు చేసే ప్రతి కష్టంలో, పనిలో దేవుడు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని తన సొంత గ్రామమైన తోపుదుర్తిలో నిర్వహించిన మొహరం వేడుకల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్లకు చక్కెర చదివించారు. అనంతరం పీరును ఎత్తుకొని ప్రజల తో కలిసి ముందుకు సాగారు. కుల మతాలతో సంబంధం లేకుండా హిందూ ముస్లింలు ప్రతి ఒక్కరూ కలిసి ఆనందంగా ఈ పండుగ చేసుకుంటారని తెలిపారు.

'నా భర్తకు హానిజరిగితే సిఐదే బాధ్యత'

ప్రజాశక్తి-తాడిపత్రి

పాత కక్షలు మనసులో ఉంచుకొని ఉద్దేశపూర్వకంగా నా భర్త అబ్దుల్ రజాక్‌ను సిఐ హమీద్‌ఖాన్ సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తున్నారని అతడి భార్య ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆమె మాట్లాడిన వీడియో చక్కర్లు కొడుతోంది. టిడిపి పట్టణ అధ్యక్షులు కెవి అబ్దుల్ రజాక్ మంగళవారం రాత్రి 7:30 గంటల నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు, భార్య తీవ్ర ఆందోళన గురయ్యారు. అర్ధరాత్రి 1.30 గంట సమయంలో వాట్స్ అప్ కాల్ చేసి సిఐ హమీద్‌ఖాన్ వద్ద ఉన్నానని, రూ. 5 లక్షలు తేవాలని సిఐ చిత్రహింసలకు గురి చేస్తున్నట్లు తెలిపారని ఆమె వాపోయింది. నా భర్తకు ఏదైనా జరిగితే సిఐ హమీద్‌ఖాన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని, అబ్దుల్ రజాక్‌ను వెంటనే చూపించాలని లేనిపక్షంలో పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యకు పాల్పడతానని ఆమె పేర్కొంది.